# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



### అప్పడు ఎండిన పంటలను తగలబెట్టుకున్నం



కరెంట్‌లేక వేసిన పంటకు నీళ్లు అందక ఎండిపోతే కన్నీరు పెట్టుకున్నం. అప్పటి పాలకులపై కోపంతో ఎండిన పంటను తగలబెట్టుకున్నం. కనీసం పశువులకు గడ్డికూడా దొరకలేదు. కాంగ్రెస్ పార్టోళ్లు రైతులను చిన్నచూపు చూసిర్రు. ఇప్పుడు కరెంట్ పుల్‌గా ఉంటుంది. వేసిన పంటకు నీరందుతుంది. మంచి దిగుబడి వస్తుంది. కేసీఆర్ సారే రాష్ట్రానికి సీఎం కావాలి.

– చిమ్ముల నర్సింహారెడ్డి, రైతు, గుమ్మడిదల

### మార్పు అంటే 3 గంటలు కాదు.. 24 గంటల కరెంట్



కాంగ్రెస్ పార్టీ 70 ఏండ్లలో రైతులకు చేసింది ఏమీ లేదు. ఆ పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియకుండే. రాత్రిలో నిద్ర కాయేటోల్లం కాదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. కాంగ్రెస్ నాయకులు 3 గంటల కరెంట్ చాలని అంటుండ్రు. దీనివల్ల పొలంలో మూల కూడా తడువదు. కాంగ్రెస్ నాయకులకు ఓటుతోనే బుద్ధి చెబుతాం.

– కమ్మరి మచ్చేందర్, తాళ్లపల్లి, సంగారెడ్డి అర్బన్

### 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు



వ్యవసాయానికి 10 హెచ్‌పీ మోటర్ అవసరమే లేదు. ఎకరాకు 3 గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి మాట్లాడటం అవివేకం. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అర్ధరాత్రి పొలానికి కరెంట్ వేసి వచ్చేటోళ్లం. నిద్ర ఉండేది కాదు. శానా తిప్పలు చూసినం. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత రైతులకు ఎంతో మేలు చేస్తుండ్రు. కాంగ్రెస్‌ని నమ్మితే కష్టాలు తప్పవు, కేసీఆర్ సారే రైతులకు మేలు చేస్తారు. 24 గంటల కరెంట్ ఇయ్యటంలో రైతులకు చాలా మేలు కలుగుతుంది. మరోసారి కేసీఆరే సీఎం అయితడు. అయనకే ఓటేస్తం.

– తుకారం, రాయికోడ్

### బీఆర్ఎస్ సర్కారుతోనే రైతులకు సంక్షేమం



రైతుల పాలిట దేవుడిలా సీఎం కేసీఆర్ ఎన్నో విధాలుగా మేలు చేస్తుంటే, కాంగ్రెస్ పార్టీ నేతలు మధ్యలో దూరి కీడు తలపెడుతున్నరు. కాంగ్రెసోళ్లు చెబుతున్న మూడు గంటల కరెంటు, ధరణి ఎత్తివేత లాంటి మాటలు రైతులు, ప్రజలెవ్వరూ నమ్మరు. 24 గంటలు ఉచితంగా ఇస్తున్న కరెంటు సరఫరా కాదని, మూడు గంటలు 10హెచ్‌పీ మోటరుతో పంటలు తడపొచ్చని కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు నమ్మితే, పాత రోజులు కొనితెచ్చుకున్నట్టే. దిక్కుమాలిన ఆలోచనలతో రైతులను నాశనం చేయాలనుకుంటున్నరు. సీఎం అమలు చేస్తున్న 24 గంటలు ఉచిత కరెంటు సరఫరా ఇప్పుడు ప్రతి రైతు సంతోషంగా ఉన్నాడు. నిరంతరాయంగా ఉచిత కరెంటు ఇచ్చే సీఎం కేసీఆర్ సార్‌కే రైతులంతా పట్టాం కట్టాలి.

– సత్యనారాయణగౌడ్ రైతు, గోసాయిపల్లి, సిర్గాపూర్ మండలం

### రైతులకు తెలవకుండా రికార్డులు మారుతయ్..



పాత కాలం రోజులు వస్తే అప్పుడు ఉన్నటువంటి రోజులాగనే ఉంటాయి. ధరణి తీసి వేస్తే రైతులకు తెల్వకుండా రికార్డులు తారుమారైతాయి. అప్పట్లో రైతులకు తెల్వకుండా రైతుల భూముల రికార్డులు తారుమారు అవుతుండే, రైతులకు తిప్పలు పడుతుండెటోళ్లు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారు చేసిన ప్రతి పని మంచిగనే ఉంది. ఇలాంటి మంచి పని చేసే నాయకులకే తెలంగాణ ప్రజలు కోరుకుంటారు. రైతుల బాధలు తెలిసిన నాయకుడు కేసీఆర్ సారు మళ్లీ ఆ సారే ముఖ్యమంత్రి అవుతాడు.

– యూసుఫ్ పాటిల్, రైతు, మనూరు

### ధరణి ఉంటేనే బాగుంటది..



ధరణి మీద లేనిపోనియి చెప్పి బద్నాం చేస్తుర్రు. ధరణి ఉంటేనే బాగుంటది. ఎనకటికి భూములు అమ్మెటోల్లకు, కొనెటోల్లకు మస్తు తిప్పలయితుండే. ధరణి వచ్చినంక తిప్పలు తప్పినయి. రిజిస్ట్రేషన్ ఆపీసుల చుట్టూ తిరిగుడు, మ్యూటేషన్ కోసం ఎమ్మార్వో ఆఫీస్ కాడ పానసరం పడుడు మరిసిపోతమా. ఎక్కడికక్కడ ముట్టజెప్పితే తప్ప పనులు కాకుండే. ఇప్పుడు మీసేవల బుక్ చేసుకుని ఎమ్మార్వో ఆఫీసుకు పోతే పది నిమిషాల్లో పని అయిపోతున్నది. కొన్నోని పేరు మీద భూమి రికార్డులకు ఎక్కుతున్నది. మన భూమి మార్చాలంటే మన బొటన వేలు పెడితే తప్ప మార్చడం ఎవని తాత తరం కాదని చెపుతున్నరు. లేకుంటే కుసున్న తావుల పట్వారీలు, ఆఫీసర్లు ఎంత మంది భూమి కింద మీద చేయలే. అవన్నీ మాకు తెలుసు. ధరణి వచ్చినంక లంచం ఇచ్చుడు లేదు, పైరవీ చేసుడు లేదు, ఎవలకు దండం పెట్టుడు లేదు. ఏ సదువు రానోనికి అడిగినా ధరణి గురించి చెప్తరు. ధరణిని కావాలనే బద్నాం చేయాలని కొంతమంది లేనిపోని మాటలు చెప్తున్నట్లు అనిపిస్తుంది.

– పత్రి విఠల్, రైతు, చాంద్‌ఖాన్‌పల్లి, నారాయణఖేడ్

### అప్పుడు తేళ్లు, పాముల మధ్య జాగారం



ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోసం రాత్రుళ్లు చేడ్లకాడ తేళ్లు, పాముల మధ్య జాగారం చేసేటోళ్లం. కరెంట్ సరిగా రాక అప్పులే మిగులుతుండే. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్ ఇస్తుండు. ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ నాయకుల మాటలు వింటే రైతు ఆత్మహత్యలే మిగులుతాయి. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టమని, 3 గంటల కరెంట్ చాలంటే రైతులకు మళ్లా జాగారం చేసే పరిస్థితి వస్తది.


– పుల మల్లేశం, కులబ్‌గూర్, సంగారెడ్డి అర్బన్

### కరెంటు కష్టాలు తీరినయ్...



ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ రైతుల అన్ని కష్టాలు తీర్చారు. కాంగ్రెసోళ్లు మళ్లీ తెలంగాణకు పాత గతి పట్టించేందుకు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కేందుకు మాయమాటలు చెబుతున్నరు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుంది అన్న రేవంత్‌రెడ్డి, వ్యవసాయం చేసి మాట్లాడుతున్నారో లేదో రైతాంగానికి చెప్పాలి. తెలంగాణ సర్కార్ ప్రస్తుతం వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుంటే, ఓర్వలేక వ్యవసాయాన్ని ఆగం చేసేందుకు కరెంటుపై మాట్లాడడం విడ్డూరం. కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు, రైతులు గమనించి తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

– మల్లేశం, రైతు, ఫసల్‌వాదీ సంగారెడ్డి మండలం



- కరెంట్ మాటెత్తితే కాట్లె కలుపుడే..
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం..
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుండా ఉన్నం
- మూడు గంటలు, 10హెచ్‌పీ మోటర్లతో ముప్పు
- కాంగ్రెస్‌ను నమ్మలేమంటున్న కర్షకులు
- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై రైతుల ఆగ్రహం

# కాంగ్రెస్ వద్దు..

# కరెంట్ కష్టాలు వద్దు

**కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు** కరెంటు కోసం ముప్పుతిప్పలు పడ్డామని, ప్రత్యక్ష నరకం చూపించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయేవని, కరెంటో రామచంద్రా అని అప్పటి పాలకులను వేడుకున్నా కనికరించలేదని మండిపడుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న 24 గంటల ఉచిత కరెంట్‌తో రంది లేకుండా పంటలు పండిస్తున్నామని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటలు కరెంట్ సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వినియోగించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రైతులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటున్న కాంగ్రెస్ తీరుపై కర్షకలోకం భగ్గుమంటున్నది. మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు తప్పవంటున్నారు. పాత పద్ధతిని తీసుకొచ్చి దళారీ వ్యవస్థను ప్రోత్సహించేలా కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని రైతులు మండిపడుతున్నారు.

- సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, నవంబర్ 24

### రైతులపై భారం పెరుగుతుంది...

కాంగ్రెస్ చెబుతున్నట్లు 10 హెచ్‌పీ మోటర్ వాడకం అనేది ఖర్చుతో కూడుకున్న పని. కాంగ్రెస్ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన మాటలు వింటే రైతులు ఆగమైతరు. 10హెచ్‌పీ మోటర్ రైతులు పెట్టాలంటే లక్ష రూపాయలకు పైగా ఖర్చు అయితది. ట్రాన్స్‌ఫార్మర్లు పని చేయవు. ఆ ఖర్చులు ఎవరు భరించాలే. కాంగ్రెస్ రైతులను అయోమయంలో పడేస్తుంది. వారి మాట వింటే నట్టేట ముంచుతారు. 24గంటల కరెంట్‌తో రైతులు వ్యవసాయాన్ని సంతోషంగా చేసుకుంటున్నం. కాంగ్రెస్ పార్టీని ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులు ఎవ్వరూ నమ్మరు. రైతులకు కేసీఆర్ సార్ అంతా మంచే చేస్తున్నారు.



– ఆనందం, రైతు, మల్లారెడ్డిపేట, మునిపల్లి మండలం

### కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే పాత రోజులు వస్తాయి...



కాంగ్రెస్ వాళ్లకు తెలంగాణలో అధికార పగ్గాలు అప్పగిస్తే మళ్లీ పాతరోజులు వస్తాయి. గతంలో రైతులకు ఉన్న కరెంట్ కష్టాలు తప్పవు. తెలంగాణ సర్కార్ ఏర్పడ్డాక రైతుల ఇబ్బందులు తెలుసుకుని వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు 24 గంటలు నాణ్యలైన కరెంట్ సరఫరా చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ వారు చెప్పినట్టు మూడు గంటల కరెంటుతో రైతు పొలంలో మడి కూడా తడవదు. 3 గంటల కరెంట్‌తో 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు భారం పడుతుంది. రైతులకు 3, 5 హెచ్‌పీ కరెంట్ మోటర్ల సరిపోతాయి.

– హీర్ రాథోడ్, అర్జున్‌నాయక్‌తండా, జహీరాబాద్ మండలం

### ధరణి పద్ధతే బాగుంది..



కాంగ్రెస్ పార్టీ పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తెచ్చే కుట్ర చేస్తున్నది. ఆ పార్టీ అధికారంలో ఉన్న రోజుల్లో లంచాలు ఇస్తే చాలు భూ రికార్డుల్లో ఏదంటే అది రాసిండ్రు. భూమి కొలతలు, పేర్లు మార్చిండ్రు. ఊర్లల్ల ఎప్పుడూ పంచాయితీలు, లొల్లిలే అయితుండే. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ సక్కగ చేసిండు. భూ రికార్డులను భద్రంగా ఉంచేందుకు ధరణి తెచ్చిండ్రు. నిజంగా ధరణి పోర్ట్ మంచిగున్నది. నిమిషాల్లో రిజిస్ట్రేషన్, పేరు మార్పిడి అవుతుంది. ధరణి పద్ధతే బాగుంది. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని కుట్రలు పన్నినా ఆటలు సాగవు. ఆ పార్టీ వచ్చేది లేదు, సచ్చేది లేదు.

– దుర్గేశ్, రైతు, మల్లారెడ్డిపేట, మునిపల్లి మండలం

### మూడు గంటలు కరెంటు వద్దు..

మూడు గంటల కరెంటు ఇస్తే గుంట కూడా తడువదు. కాంగ్రెస్ హయాంలో రైతులు తెల్లందాకా చేను కాడనే ఉండెటోళ్లం. కరెంటు ఎప్పుడు వస్తుందో, నీళ్లు ఎప్పుడు పార బెట్టుకోవాలో అని నిద్ర లేని రాత్రులు గడిపినం. కేసీఆర్ సార్ కడుపు సల్లగుండ, ఇప్పుడు 24 గంటల కరెంటు ఇస్తుండు. యాడాదికి రెండు పంటు తీస్తున్నం. పాత రోజులు గుర్తుకు తెచ్చుకోవాలంటే భయమేస్తుంది. కాంగ్రెసోళ్లకు మేము ఓటు వేసే ప్రసక్తేలేదు. బీఆర్ఎస్‌కే మళ్లీ ఓటు వేసి గెలిపించుకుంటాం.

– చిరంజీ మాణిక్‌రెడ్డి, రైతు, పుల్కల్



### కాంగ్రెస్ అంటే కరెంటు కష్టాలే..



కాంగ్రెస్ రైతుల కోసం ఎన్నడూ మంచి పనులు చేయలేదు. గతంలో తొమ్మిది గంటల కరెంటు ఇస్తామని కేవలం ఐదారు గంటలు మాత్రమే ఇచ్చారు. అది కూడా రాత్రుల్లో ఇవ్వడంతో రైతులు కష్టాలు పడ్డారు. ఇప్పుడు మూడు గంటలు సరిపోతుందని పిట్ట కథలు చెబుతున్నారు. రైతులందరూ టెన్ హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని పనికిమాలిన సలహా ఇస్తున్నారు. రైతులను తక్కువ చేసి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి. ఎల్లప్పుడూ రైతుల మంచి కోసం ఆలోచించే కేసీఆర్‌ను మరోసారి గెలిపించుకుంటాం.

– సంగారెడ్డి, రైతు, కవేలి, కోహీర్ మండలం

### అప్పడు కరువు కండ్ల చూసినం..



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు కరెంట్ లేక పంటపొలాలు ఎండిపోడంవల్ల కరువును కండ్ల చూసినం. ఇప్పుడు రోజంతా కరెంట్ వస్తుంది. పంటలన్నీ నీళ్లతో పండిస్తున్నం. తెలంగాణ రాష్ట్రం వచ్చినంకా సీఎం కేసీఆర్ పాలనలో కరెంట్ కోసం ఎదురు చూపులు లేవు. వేసిన పంట బాగపండుతుంది. మస్తు దిగుబడి వస్తుంది. రైతులను ఎప్పటికి ఆదుకుని కండ్లలో పెట్టుకునే సర్కారే మాకు కావాలి. కాంగ్రెస్, బీజేపీల నాయకులు మస్తు చెబుతరు. వారిమాటలు నమ్మం. కేసీఆర్ సారే మా నమ్మకం.

– చంద్రారెడ్డి, రైతు, గుమ్మడిదల

### మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది..



గతంలో ఎక్కడ చూసినా భూ సమస్యలే ఉండేవి. పేరు మార్చుకోవాలన్న, పట్టా కావాలన్నా అంతా దళారులదే రాజ్యం. వాళ్లు చెప్పినంత ఇచ్చి పని చేసుకునే వాళ్లం. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ తెచ్చి సమస్యలకు చెక్ పెట్టిన్రు. ఇప్పుడున్న రోజుల్లో భూములు అమ్మినా, కొనుగోలు చేసిన ధరణి పోర్టల్ ద్వారా క్షణల్లో రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుంది. ధరణి పోర్టల్‌ను ఎత్తివేయాలని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. అట్లయితే మళ్లీ రైతుల మధ్య చిచ్చు పెట్టినట్లే. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల భూములకు రక్షణ లేకుండా పోయింది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ పెట్టి ప్రతి రైతుకు పట్టదారు పాస్‌పుస్తకాలు అందించి రైతుల సమస్యలు తీర్చారు. ధరణిని ఎత్తివేస్తే మోసం జరుగుతది.

– గొల్ల గంగారం, రైతు, మల్లారెడ్డిపేట, మునిపల్లి మండలం

